క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
మంత్రి పార్థసారథి

నూజివీడు: రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండి పలు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కార్యాలయ వర్గాలు ఒక ప్రకటన విడుదల చేశాయి. భారీ వర్షాలకు నూజివీడు నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తన కార్యాలయంలో ఉండే తన కార్యదర్శి దృష్టికి తీసుకు రావాలని సూచించారు.

సీజనల్ వ్యాధులు నియంత్రించాలని వినతి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్ వై.శంకర్ నాయక్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వర్షాల కారణంగా పొంగి పొర్లుతున్న డ్రెయినేజీల్లో మురుగునీరు పారుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని, వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా వైద్య శిబిరాలు నిర్వహించాలని, కోతులు, వీధి కుక్కలు, దోమల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే కందిపప్పు విక్రయం



చాట్రాయి: ప్రత్యేక కౌంటర్ల ద్వారా తక్కువ ధరలకే ప్రభుత్వం కందిపప్పుని విక్రయిస్తోందని సివిల్ సప్లయీస్ డీటీ జి.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం చాట్రాయిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డు ఉన్న వారికి కిలో కంది పప్పు, 5 కిలోల నాణ్యమైన బియ్యం తక్కువ ధరకే విక్రయిస్తామని చెప్పారు.

ఆంజనేయపురంలో ప్రత్యేక వైద్య శిబిరం



ఆంజనేయపురం(తిరువూరురూరల్): మండలంలోని ఆంజనేయపురంలో శుక్రవారం జ్వర పీడితులకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. చౌటపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రావ్య పూర్ణిమ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది గ్రామంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. గ్రామంలో జ్వర పీడితుల గుర్తింపునకు ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటి సర్వే చేపట్టారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలకు, సాధారణ జ్వరాలకు చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందులు అందుబాటులో ఉన్నాయని, రక్త పరీక్షలు కూడా చేస్తామని వైద్యాధికారి తెలిపారు. నివాసగృహాల పరిసరాల్లో దోమలు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కుళ్లిన చెత్తతో ఇబ్బందుల



ఆగిరిపల్లి: స్థానిక హైస్కూల్ రోడ్డులో వ్యర్థాలు కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ ప్రాంతంలో పారిశుద్ధ్య కార్మికులు మూడు రోజులకోసారి చెత్త తొలగిస్తుండటంతో స్థానికులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇళ్లలోని చెత్త తీసుకువెళ్లేందుకు రిక్షాలు కూడా రాకపోవడంతో చెత్తను అక్కడ వేస్తున్నట్లు పరిసర ప్రాంత ప్రజలు చెబుతున్నారు. చెత్త వల్ల పందులు కూడా సంచరిస్తున్నాయి. అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో చెత్తకుండీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వీడని వర్షం

- ఎడతెరపి లేకుండా కురుస్తున్న జల్లులు
- వాగుల్లో వరద నీటి ప్రవాహం
- నిండుతున్న చెరువులు
- స్తంభించిన జన జీవనం



బేతుపల్లి చెరువు అలుగు వద్ద వరద ఉధృతి

నూజివీడు/మైలవరం/ తిరువూరు: నూజివీడు, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో రెండు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ముసురు వర్షంతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. విద్యార్థులు, ప్రైవేట్ ఉద్యోగులు తప్పనిసరి పరిస్థితుల్లో గొడుగులు, రెయిన్‌కోట్ల సాయంతో వెళ్లివస్తున్నారు. వ్యాపారాలు సాగక చిరు వ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వాగుల్లోకి వరద నీరు చేరుతోంది.

వాగుల్లో భారీగా వరద నీరు..

చాట్రాయి: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి చెరువుల్లో వర్షం నీరు చేరుతోంది. ఉప్పు వాగు, రేగడి వాగుల్లో భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు అలుగు నుంచి భారీగా వరదతో పాటు మండలంలో కురుస్తున్న వర్షానికి తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టుకి భారీగా వరద నీరు చేరుతోంది. మండలంలోని చిన్నంపేట వద్ద తమ్మిలేరు వంతెనపై నుంచి రిజర్వాయర్‌కి చేరుతుంది. అలాగే సీకే పాడు చానల్ ద్వారా కోటపాడు, చిన్నంపేట గ్రామాల్లోని చెరువులు నిండిపోయాయి. చిన్నంపేట తమ్మిలేరు వాగు వద్ద ప్రవహిస్తున్న వరదను తహసీల్దార్ మహ్మద్ మసూద్ ఆలీ పరిశీలించారు.

కూలిన ఇల్లు

వర్షాలకు మండలంలోని సోమవరం గ్రామానికి చెందిన రాజులపాటి సరస్వతి పెంకుటిల్లు శుక్రవారం ఉదయం కూలిపోయింది. ఇల్లు కూలిన సమయంలో సరస్వతి ఇంటి బయట పనులు చేస్తుండడంతో ప్రాణాపాయం తప్పింది. తహసీల్దార్ మహ్మద్ మసూద్ ఆలీ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

69.2 మి.మీ వర్షపాతం నమోదు

నూజివీడు: నూజివీడు డివిజన్‌లో గడిచిన 24 గంటల్లో భారీ వర్షం కురిసింది. డివిజన్ వ్యాప్తంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి శుక్రవారం ఉదయం 8 గంటల వరకు మొత్తం 415.6 మి.మీ వర్షపాతం నమోదైంది. నూజివీడు మండలంలో 64.6 మి.మీ, ఆగిరిపల్లిలో 28.6 మి.మీ, ముసునూరులో 48 మి.మీ, చాట్రాయిలో 57.8 మి.మీ, చింతలపూడిలో 115.2 మి.మీ, లింగపాలెం మండలంలో 101.4 మి.మీల వర్షం కురవగా డివిజన్ సగటు వర్షపాతం 69.2 మి.మీగా నమోదైంది.



చిన్నంపేట వద్ద తమ్మిలేరు వాగులో ప్రవహిస్తున్న వరదను పరిశీలిస్తున్న తహసీల్దార్

రోజంతా ఒకటే ముసురు

నూజివీడు: నియోజకవర్గ వ్యాప్తంగా రెండో రోజైన శుక్రవారం వర్షం కురుస్తూనే ఉంది. విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు పాఠశాలలకు, కార్యాలయాలకు వెళ్లి వచ్చేందుకు ఇబ్బందులకు గురయ్యారు.నియోజకవర్గంలోని చెరువుల్లోకి ఇప్పుడిప్పుడే నీరు వచ్చి చేరుతోంది. రాత్రంతా కురిసి పగలు తెరిపిస్తే పనులు సాగుతాయని రైతులు, వ్యాపారాలు ఉంటాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. వర్షంతో రోడ్లన్నీ జనసంచారం లేక నిర్మానుష్యంగా మారాయి.



సోమవరంలో కూలిన ఇల్లు

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: మండలంలో రెండు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించిపోయింది. ఎక్కువ మంది ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మండలంలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి .

- **ముసునూరు:** మండలంలోని పలు గ్రామాల్లో డ్రెయిన్లలో పూడిక తీయకపోవడంతో వర్షం నీరు రహదారులపై ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్ని చోట్ల ఇళ్లల్లోకి వర్షం నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చెక్‌డ్యాం కమ్ బ్రిడ్జి వద్ద వరద నీరు ప్రవహిస్తోంది. ముసునూరు, పెదవేగి మండల ప్రయాణికుల ఇబ్బందులకు గురయ్యారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వై.శంకర్ నాయక్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): దోమల నివారణకు వైద్య ఆరోగ్య, మున్సిపల్ సిబ్బంది పటిష్ట చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ వై.శంకర్ నాయక్ అన్నారు. కొండపల్లి పీహెచ్‌సీలో ఫ్రైడే డ్రై డే సందర్భంగా వైద్యురాలు పద్మావతి అధ్యక్షతన ఆయా శాఖల సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పారిశుద్ధ్య లేమితో దోమలు వృద్ధి చెంది డెంగీ, టైఫాయిడ్, మలేరియా జ్వరాలు వ్యాపిస్తాయన్నారు. తాగునీరు క్లోరినేషన్‌తో పాటు వీధులను శుభ్రం చేయాలని చెప్పారు. డాక్టర్ ఆర్.పద్మావతి మాట్లాడుతూ దోమలు వ్యాప్తి చెందకుండా చేపట్టాల్సిన నివారణ చర్యలపై సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యత అని అన్నారు.

అనంతరం వీధుల్లో ర్యాలీ నిర్వహించి ఇళ్లల్లో దోమల లార్వా వ్యాప్తిని పరిశీలించారు. సచివాలయాల ఉద్యోగులు, మున్సిపల్, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గుంతలో దిగబడిన లారీ

రాకపోకలకు అంతరాయం



మైలవరం చిన్న రామాలయం వీధిలో మట్టి రోడ్డులో దిగబడిన లారీ

మైలవరం: మైలవరం-నూజివీడు రోడ్డులోని చిన్న రామాలయం వీధిలో శుక్రవారం లారీ దిగబడింది. వాహనాల రాకపోకలకు సుమారు గంటకు పైగా అంతరాయం ఏర్పడి స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అంతర్గత రహదారులు జలమయంగా మారాయి. మట్టి రహదారులు కావడంతో వర్షం నీటికి రహదారులు నాని లోడుతో వెళుతున్న లారీలు దిగబడి పోతున్నాయి. ఈ వీధిలో ఎక్కువగా వ్యాపార సంస్థలు ఉన్నాయి. దీంతో అధిక లోడు లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి.

వైఎస్సార్ హయాంలో సీసీ రోడ్లుగా అభివృద్ధి

గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అంతర్గత రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించడంతో మైలవరంలో అప్పట్లో అంతర్గత రహదారులను చాలా వరకు సీసీ రోడ్లుగా అభివృద్ధి చేశారు. అనంతరం వచ్చిన టీడీపీ ప్రభుత్వం అంతర్గత రహదారుల అభివృద్ధిని పట్టించుకోలేదు. కాగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కొంత వరకు అంతర్గత రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం మైలవరంలోని అంతర్గత రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుని ప్రజల ఇబ్బందులను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అసంపూర్తిగా 'కానుక'



ఆగిరిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సివిల్ డ్రెస్‌తో వచ్చిన విద్యార్థులు

- విద్యార్థులకు యూనిఫాం పంపిణీలో జాప్యం
- పంపిణీపై స్పష్టత లేకపోవడంపై తల్లిదండ్రుల ఆవేదన
- పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికే అందించిన గత ప్రభుత్వం

ఆగిరిపల్లి: కూటమి ప్రభుత్వంలో విద్యా కానుక అసంపూర్తిగా మాత్రమే విద్యార్థులకు పంపిణీ చేశారు. పుస్తకాలు కూడా అరకొరగానే అందజేశారు. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు విద్యార్థులకు ప్రభుత్వం యూనిఫాం పంపిణీ చేయలేదు. దీంతో కొందరు విద్యార్థులు గత ఏడాది ఇచ్చిన యూనిఫాం వేసుకుని స్కూల్‌కి వస్తున్నారు. మరి కొందరు విద్యార్థుల యూనిఫాం చిరిగిపోవడంతో సివిల్ దుస్తుల్లో రావాల్సి వస్తోంది. రెండు నెలలు అవుతున్నా ఇప్పటివరకు యూనిఫాం పంపిణీపై స్పష్టత లేకపోవడంతో ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

స్పష్టత కరవు..

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫాం పంపిణీలో ప్రభుత్వం జాప్యం చేస్తోంది. మండలంలో 50 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉండగా ఒకటి నుంచి పదో తరగతి వరకు 3,551 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి రెండు జతల యూనిఫాంకు సరిపడా క్లాత్ పంపిణీ చేసి కుట్టు కూలీ కూడా ఇవ్వాల్సి ఉంది. అయితే మండలంలో ఇప్పటికీ ఒక్క విద్యార్థికి కూడా యూనిఫాం క్లాత్ పంపిణీ చేయలేదు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తే ఉపాధ్యాయుల నుంచి స్పష్టమైన సమాచారం కరవైంది. అసలు యూనిఫాం క్లాత్ ఇస్తారా.. ఇవ్వరా అనే సందిగ్ధత నెలకొంది.

ఇప్పటికే ఆలస్యమైంది

ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు యూనిఫాం క్లాత్ త్వరగా అందజేయాలి. ఇప్పటికే ఆలస్యమైంది. క్లాత్ ఇప్పుడు ఇచ్చినా టైలర్ దగ్గర మరో 15 రోజులు పడుతుంది. నాణ్యమైన క్లాత్ సరఫరా చేస్తే బాగుంటుంది. యూనిఫాం లేక పిల్లలు బడికి వెళ్లేందుకు నిరాకరిస్తున్నారు.

– శివపార్వతి, విద్యార్థి తల్లి, ఆగిరిపల్లి

త్వరలోనే వచ్చే అవకాశం



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశాం. అందులో యూనిఫాం క్లాత్ రాలేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తే త్వరలోనే వచ్చే అవకాశం ఉందని తెలిపారు. క్లాత్ రాగానే అన్ని పాఠశాలలకు సరఫరా చేస్తాం.

– ఆనంద్ కుమార్, ఎంఈఓ, ఆగిరిపల్లి

గత ప్రభుత్వంలో ఇలా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పాఠశాల ప్రారంభమైన రోజే జగనన్న విద్యా కానుక పేరిట పూర్తి విద్యా సామగ్రితో కిట్ అందజేసే వారని విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తు చేసుకుంటున్నారు. అందులో పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలతోపాటు యూనిఫాం, బూట్లు, సాక్సులు ఉండేవని వివరిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యా కానుక పేరు మార్చడంలో చూపిన శ్రద్ధ, పిల్లలకు విద్యా సామగ్రిని సకాలంలో అందించడంలో చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదే ఇలా ఉంటే రానున్న రోజుల్లో పరిస్థితి ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి యూనిఫాం పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కట్టెలేరు వరదపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ జి. సృజన



కట్టెలేరును పరిశీలించి సూచనలిస్తున్న కలెక్టర్ సృజన

గంపలగూడెం: మండలంలోని ప్రధాన నీటి వనరైన కట్టెలేరులో వరద పరిస్థితిని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. సృజన శుక్రవారం పరిశీలించారు. స్థానికంగా కురిసే వర్షాలకు తోడుగా ఎగువ తెలంగాణ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు ఏటిలో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. నాలుగు రోజుల కిందట ఏటిలో వరద కారణంగా రాకపోకలు నిలిచిన విషయం తెలిసిందే. కాగా మళ్లీ వరద ఉధృతి శుక్రవారం పెరిగింది. దీంతో కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఏటిపై నిర్మించిన లోలెవల్ వంతెన ధ్వంసం కావడం, ప్రత్యామ్నాయంగా డైవర్షన్ రహదారి నిర్మించామని.. వరద వచ్చినప్పుడల్లా డైవర్షన్ రహదారిపై కూడా నీరు ప్రవహించటంతో రాకపోకలు నిలిచిపోతున్నాయని అధికారులు ఆమెకు వివరించారు. నీటి ప్రవాహం తగ్గేవరకు ఏటిపై రాకపోకలు కొనసాగకుండా తగిన భద్రతా ఏర్పాట్లు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. తిరువూరు ఆర్డీఓ మాధవి, గంపలగూడెం తహసీల్దార్ సుగుణ పాల్గొన్నారు.

పొంగుతున్న వాగులు

- నిండిన చెరువులు
- ఖరీఫ్ సాగుకు సమృద్ధిగా నీరు

తిరువూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో తిరువూరు నియోజకవర్గంలో జనజీవనం స్తంభించింది. ఎడతెరపి లేని వర్షాలతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాగులు, వంకలు పొంగుతుండటంతో గ్రామీణ రహదారుల్లో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. తిరువూరు మండలంలో కట్టెలేరు, పడమటివాగు, విప్లవాగు, వెదుళ్లవాగు, గుర్రపు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎగువన తెలంగాణ రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు సైతం వాగులలో వరదనీరు చేరుతోంది. జూలైలో ఇంత వరకు సగటుకు మించి వర్షపాతం నమోదు కావడంతో ఖరీఫ్ సాగుకు ఇబ్బందులు తప్పాయి.

చెరువులకు జలకళ

వర్షాభావంతో కొన్ని నెలలుగా ఎండిపోయిన సాగునీటి చెరువులు భారీ వర్షాల కారణంగా జలకళ సంతరించుకున్నాయి. తిరువూరు మండలంలోని మల్లమ్మ చెరువు, పోతుల చెరువు, దేవ సముద్రం చెరువులు నీటితో నిండాయి. పడమటివాగు, కట్టెలేరు వాగు ఆయకట్టులో ఖరీఫ్ సాగు నిమిత్తం వేసిన వరినారుమళ్లు నీటమునిగాయి. కోకిలంపాడు, అక్కపాలెం, మల్లేల, చౌటపల్లి గ్రామాలకు వెళ్లే రహదారుల్లో లోతట్టు వంతెనలున్న ప్రాంతాల్లో వరద ఉధృతిని అధికారులు గమనిస్తూ వాహనాల రాకపోకలను నియంత్రిస్తున్నారు.



నీటితో కళకళలాడుతున్న తిరువూరు పోతుల చెరువు

జూలైలో నమోదైన వర్షపాతం

తిరువూరు 120 మి.మీ, గంపలగూడెం 94 మి.మీ, విస్సన్నపేట 93 మి.మీ, ఎ.కొండూరు 96 మి.మీ, రెడ్డిగూడెం 40 మి.మీ వర్షపాతం నమోదైంది.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

జి.కొండూరు: రెడ్డిగూడెం మండలంలోని రుద్రవరం, రెడ్డికుంట, కూనప రాజుపర్వ-2 సచివాలయాల పరిధిలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ సందేష్ మాట్లాడుతూ ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి పదార్థాలను భుజించాలని చెప్పారు. జ్వరాలు, వాంతులు, విరోచనాలు ఉన్నవారు వెంటనే రెడ్డిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో మలేరియా, డెంగీ పరీక్షలు చేస్తారని చెప్పారు. కిడ్నీ, లివర్ పరీక్షలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమాలలో డాక్టర్ పి. మణిబాబు, మండల అభివృద్ధి అధికారి, ఈఓపీఆర్డీ, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నారుమడుల్లోని నీటిని తొలగించాలి

ముసునూరు: అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వరి నారు మడుల్లో నీరు అధికమైతే తక్షణం తొలగించాలని మండల వ్యవసాయాధికారి సందిపాము మధుమోహన్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నారుమడుల్లో గానీ, నాట్లు వేసిన పొలాల్లోగాని నీరు అధికంగా నిలిచి ఉంటే తక్షణం తొలగించాలని, లేకుంటే నారు కుళ్లిపోతుందని హెచ్చరించారు. వర్షాలు మరి కొన్ని రోజులు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రైతులు కచ్చితంగా నారు మడుల్లోని, నాట్లు వేసిన పొలాల్లోని నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

వారానికి ఒక రోజు డ్రై డే పాటించాలి



నూజివీడు: పట్టణ ప్రజలు వారానికి ఒక రోజు డ్రైడేను పాటిస్తే ప్రమాదకరమైన డెంగీ జ్వరం వ్యాప్తిని పూర్తిగా అరికట్టవచ్చని మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకటరామిరెడ్డి అన్నారు. పట్టణంలో దోమల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఫ్రై డే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆరోగ్యసిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇళ్లల్లోనూ, పరిసరాల్లోనూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో కాల్వలు శుభ్రం చేస్తున్నామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.